క్లుప్తంగా

వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ



తల్లులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న సర్పంచ్

రాజవొమ్మంగి: చెరకుంపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. పిల్లలకు తల్లిపాల ప్రాసస్త్యం గురించి సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు వివరించారు. వైఎస్సార్ పోషణ కిట్లను (టేక్ హోం రేషన్) బాలింతలకు, గర్భిణులకు పంపిణీ చేశారు. వార్డు మెంబర్ రాజులమ్మ, అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి పాల్గొన్నారు.

పొల్లూరులో పోషకాహార కిట్లు పంపిణీ

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పొల్లూరు అంగవాడీ కేంద్రంలో గర్భిణులకు పోషకాహార కిట్లను వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి పేపకాయల శ్రీను, వార్డు సభ్యులు పల్లాల మాదిరెడ్డి, వల్లెలా లింగమ్మ, అంగన్‌వాడీ టీచర్ కిరణ్‌కుమారి పంపిణీ చేశారు. వార్డు మాజీ సభ్యురాలు కనకదుర్గ, పార్టీ కార్యకర్త కోతేమ్ దుర్గ పాల్గొన్నారు.

పీఎం ఆది ఆదర్శ గ్రామ యోజనపై సమావేశం రేపు

కొయ్యూరు: పీఎం ఆది ఆదర్శ గ్రామ యోజనపై ఈ నెల 10న నిర్వహించే సమావేశానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం తెలిపారు. గైర్హాజరైన అధికారుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ, విద్య సహాయకులు రావాలన్నారు. పీవీటీజీల గ్రామాల సర్వేపై సమావేశం ఉందన్నారు.

కాఫీ తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



గొప్పువీధిలో కాఫీ మొక్కలు నాటుతున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి, తదితరులు



రైతులతో కాఫీ మొక్కలను నాటిస్తున్న ఎంపీడీవో రమేష్, లైజన్ వర్కర్లు



రైతులకు కాఫీ మొక్కలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్

జి.మాడుగుల: రైతులు కాఫీ పెంపకంపై దృష్టి సారించాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. పాడేరు ఐటీడీఏ కాఫీ ఆధ్వర్యంలో సింగర్బ పంచాయతీ గొప్పువీధిలో మంగళవారం ఆమె కాఫీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీలో కాఫీ తోటల పెంపకానికి అనుకూల వాతావరణం ఉండటంతో ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఈ ఏడాది మండలంలో 2 వేల ఎకరాల్లో కొత్తగా కాఫీ తోటల పెంపకం, 1,800 ఎకరాల్లో గ్యాప్ ఫిల్లింగ్, 1,140 ఎకరాల్లో కాఫీ తోటల అభివృద్ధి పనులకు ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీలు మత్స్యరాస విజయలక్ష్మి, గబ్బాడి సన్యాసిదొర, పాడేరు ఐటీడీఏ కాఫీ హార్టికల్చర్ అధికారి రూడి అప్పారావు, మినుములూరు కాఫీ బోర్డు టెక్నికల్ అధికారి దివ్య, కాఫీ సిబ్బంది జగదీష్, లకే జనార్దన్ మజ్జి, లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

ఎకరానికి వెయ్యి కాఫీ మొక్కలు

ముంచంగిపుట్టు: ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఎకరానికి వెయ్యి కాఫీ మొక్కల చొప్పున అందిస్తుందని ఎంపీడీవో ఆర్.వి.ఎస్ రమేష్ తెలిపారు. కరిముఖిపుట్టు పంచాయతీ మెరకచింతలో కాఫీ మొక్కల ప్లాంటేషన్‌ను మంగళవారం ఆయన ఎంపీటీసీ విజయలక్ష్మితో కలిసి ప్రారంభించారు. రైతులతో కాఫీ మొక్కలను నాటించారు. వాటి పెంపకంపై అవగాహన కల్పించారు. మండలంలోని 23 పంచాయతీల్లో నూతన కాఫీ ప్లాంటేషన్ పనులను అధికారులు ప్రారంభించారు. ఏఈవో కె.శ్రీరాములు, ఎఫ్‌కే కొండలరావు, వైఎస్సార్‌సీపీ మండల నేతలు అర్జున్, రాంప్రసాద్, రఘునాథ్, మండల కాఫీ లైజన్ వర్కర్లు జగన్నాథం, శంకర్‌రావు, హరికృష్ణ, గణేష్ పాల్గొన్నారు.

ఏడుగురు రైతులకు మొక్కల పంపిణీ..

అనంతగిరి: కాఫీ తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి చెందాలని జెడ్పీటీసీ గంగరాజు అన్నారు. ఎగువశోభ పంచాయతీ భీసుపురం గ్రామంలోని ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఏడుగురు కాఫీ రైతులకు 14 ఎకరాలకు సంబంధించిన కాఫీ మొక్కలను సర్పంచ్ సింహాద్రితో కలిసి ఆయన మంగళవారం పంపిణీ చేశారు. హార్టికల్చర్ అధికారి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం



సీలేరు: నేలజర్తలో ఆదివాసీ దినోత్సవం ర్యాలీ



గూడెంకొత్తవీధి: జెండాను ఆవిష్కరించిన నేతలు

సీలేరు: గుమ్మిరేవుల పంచాయతీ నేలజర్త గ్రామంలో ఆదివాసీ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ, ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు గిరిజనులకు చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కోడా ఆనంద్, సుంకరి విష్ణుమూర్తి, గణేశ్వరరావు, మల్లు దొర, పోతురాజు, అల్లంగి రాజు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

కె.కొడిసింగిలో జెండా ఆవిష్కరణ

గూడెంకొత్తవీధి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం లక్కవరపుపైట పంచాయతీ కె. కొడిసింగిలో జెండాను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచెల రామకృష్ణ ఆవిష్కరించారు. మణిపూర్ హింసపై నిరసన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సత్యనారాయణ, బోండ్ల చిరంజీవి, బీ గణేష్, నారాయణరావు, శ్రీనివాస్, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంచుర్బ ఉపాధ్యాయినికి షోకాజ్



వంచుర్బ పాఠశాలలో విద్యార్థిని విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో కృష్ణమూర్తి

పెదబయలు: మండలంలోని ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంఈవో-1 కొమ్ము కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం బొంగరం పంచాయతీ వంచుర్బ జీపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల పనితీరుపై విద్యార్థులను వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో నోట్ పుస్తకాలు, వర్కు పుస్తకాలు ఉపాధ్యాయులు దిద్దడం చేయకపోవడంతో ఉపాధ్యాయిని కె.సూర్యకాంతంకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. గోమంగి పంచాయతీ రాయిమామిడి ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి చదివించారు. బాగా చదవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం నేర్పించాలన్నారు. మెరుగైన విద్య అందించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బొండాపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం ఎం. అప్పారావు, సీఆర్పీ ఉపేంద్ర, బొంగరం ఎంపీటీసీ మత్స్య కొండబాబు పాల్గొన్నారు.

తక్షణ సాయం అందజేత



ఎటపాక: నగదు అందిస్తున్న సచివాలయ సిబ్బంది



ముంచంగిపుట్టు: నగదు అందజేస్తున్న వైస్ ఎంపీపీ

ముంచంగిపుట్టు: వనుగుమ్మ పంచాయతీ పనస గ్రామానికి చెందిన కిల్లో బాబూరావు అనారోగ్యంతో మృతి చెందాడు. సర్పంచ్ కిరసాని మిల్కి, నేతలతో కలిసి వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు మృతుడు భార్య మాలతికి అందజేశారు. వైస్ సర్పంచ్ సీతారాం, వార్డు మెంబర్ కాంతమ్మ, సచివాలయ కన్వీనర్లు నాగేష్, బుద్దు, గృహ సారథులు మహదేవ్, రఘు, తిరుపతి పాల్గొన్నారు.

ఎటపాక: రైతు బొమ్మగాని వీరవెంకట్రావు కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేశారు. గౌరీదేవిపేటకు చెందిన రైతు ఇటీవల పశువుల కోసం వెళ్లి గోదావరిలో పడి చనిపోవటంతో రూ.10 వేలు సొసైటీ చైర్మన్ ఆకుల వెంకటరామారావు ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి అందించారు. ఎంపీటీసీ మంగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరాలు

రాజవొమ్మంగి: మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతున్న రోగుల కోసం బుధవారం ఎల్లవరం పీహెచ్‌సీలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, గంగవరం పీహెచ్‌సీలో 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు డాక్టర్ రామారెడ్డి తెలిపారు. వీటిని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయిక్

అరకులోయ టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల డిగ్రీ కళాశాలలో మంగళవారం క్విట్ ఇండియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల చరిత్ర విభాగం, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ కె. భరత్‌కుమార్ నాయిక్, డాక్టర్ సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమాల్లో క్విట్ ఇండియా ఉద్యమం గొప్పదన్నారు. అధ్యాపకులు వై. విజయలక్ష్మి, పి. నాగబాబు మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఆగస్టు ఉద్యమం అని కూడా అంటారన్నారు. బీఏ ద్వితీయ సంవత్సర విద్యార్థి వి. భరత్‌కుమార్ ఉద్వేగ ప్రసంగంతో ఆకట్టుకున్నాడు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పుష్పరాజు, కో ఆర్డినేటర్ డాక్టర్ పి. కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవో ఎం. అనిత కుమారి, అధ్యాపకులు గణేష్, పి. సుందరి రాణి, ఎన్. నాగేశ్వరరావు, జి. గుర్రయ్య, రాజు, సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



నేటి నుంచి నా భూమి-నా దేశం

అడ్డతీగల/రాజవొమ్మంగి/జి.మాడుగుల: ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో బుధవారం నుంచి 9 అంశాలతో కూడిన నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవోలు కె.బాపన్నదొర, యాదగిరీశ్వరరావు, ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు తెలిపారు. మొదటి రోజు స్వాతంత్ర్య సమరయోధులను, వీరులను గుర్తుచేసుకుంటూ నీటి వనరుల వద్ద జ్ఞాపక శిలాఫలకాలను ఏర్పాటు చేయాలన్నారు. మట్టిని గాని మట్టి దీపాలు గాని చేతబూని ప్రజలంతా వాటి వద్ద పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఈ నెల 9 నుంచి 10, 11, 14, 15, 16, 27, 29, 30వ తేదీ వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులతో చర్చించారు. ఎంఈవోలు-1,2 తాతబ్బాయిదొర, సూరారెడ్డి, జెడ్పీటీసీ డాక్టర్ ఎం. వెంకటలక్ష్మి, ఎంపీపీ పద్మ, వైస్ ఎంపీపీలు చప్పా చంద్రరాణి, జుర్రా రాజేశ్వరి పాల్గొన్నారు.

3 వార్డులకు ఎన్నిక నోటిఫికేషన్

కొయ్యూరు: మండలంలోని నడింపాలెం ఆరో వార్డు, పెదమాకవరం ఒకటో వార్డు, రేవళ్ల ఐదో వార్డుకు ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ వెలువడిందని ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల పదో తేదీలోపు నామినేషన్‌లు వేయాలన్నారు. 11న నామినేషన్ల పరిశీలన, 14న నామినేషన్ల ఉపసంహరణ, 19న ఉదయం ఏడు నుంచి ఒంటి గంట వరకు పోలింగ్, తర్వాత ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

మారుమూల గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యం

- 3 గ్రామాల్లో తాగునీటి పథకాల పనులను ప్రారంభించిన ఎంపీపీ శెట్టి నీలవేణి



బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, తదితరులు

అనంతగిరి: గిరిశిఖర గ్రామాల్లో అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ శెట్టి నీలవేణి అన్నారు. మండలంలోని రొంపల్లి, ఎన్ఆర్‌పురం పంచాయతీల్లో గిరిశిఖర గ్రామాలైన బూరుగు, చినకోనెల, బొంగిజల్లో జలజీవన్ మిషన్ పథకం పనులను ఎంపీపీ శెట్టి నీలవేణి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాది క్రితం మూడు గ్రామాల్లో పర్యటించి, సమస్యలపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినట్లుగా తెలిపారు. ఎన్ఆర్ పురం నుంచి బూరుగు వరకు రహదారి నిర్మాణం చేపట్టామని తెలిపారు. తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని గిరిజనులకు హామీ ఇచ్చారు. కో ఆప్షన్ సభ్యుడు మదీనా, కార్యదర్శి సుభశేఖర్, గిరిజనులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో వాలీబాల్ పోటీలు

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. పంద్రాగస్టు సందర్భంగా ప్రిన్సిపాళ్లు డాక్టర్ భరత్‌కుమార్ నాయిక్, డాక్టర్ సీహెచ్ రామకృష్ణల ఆదేశాల మేరకు ఈ పోటీలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. పుష్పరాజు, పట్టాసి చలపతిరావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జి పసుపులేటి నాగరాజు, కో ఆర్డినేటర్ డాక్టర్ పి. కొండబాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, ఎం. అనిత కుమారి, అధ్యాపకులు గణేష్, పి. సుందరిరాణి, ఎన్. నాగేశ్వరరావు, గోపాలకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.